నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 25 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI


### అడుగడుగునా నీరాజనం

కేసీఆర్ బస్సుయాత్రకు జిల్లాలో అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. చౌటుప్పల్ నుంచి మిర్యాలగూడ వరకు, అటు నుంచి సూర్యాపేట వరకు దారి పొడవునా బీఆర్ఎస్ శ్రేణులు, జనం ఆసక్తితో బస్సుయాత్రను గమనించారు. చేతులు ఊపుతూ స్వాగతించారు. కేసీఆర్ కూడా ప్రతిగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అన్నెపర్తి వద్దకు కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్న రైతులు బస్సురాగానే ఎదురెళ్లారు. రైతులను చూసి కేసీఆర్ బస్సును ఆపి వాళ్లతో ముచ్చటించారు. ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులను అడుగుతూ పంటలు పండినయా... కరెంటు ఎట్లుంటున్నది.. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా అని ఆరా తీశారు. బోనస్ గురించి కొట్లాడాలని రైతులు కోరగా, కొట్లాడుదాం అని అభయమిచ్చారు. ఆర్జాలబావి వద్ద కూడా రైతులు, హమాలీలు పెద్ద సంఖ్యలో కేసీఆర్ బస్సుకు ఎదురొచ్చారు. దాంతో బస్సు దిగి వారితో మాట్లాడారు. 20రోజులైనా ధ్యానం కొంటలేరని తమ ఇబ్బందులను కేసీఆర్‌తో రైతులు ఏకరువు పెట్టారు. 'మీ పాలనే బాగుంది... మళ్లీ మీరే రావాలి' అంటూ రైతులు కేసీఆర్‌ను దీవించారు. అనంతరం మిర్యాలగూడ రోడ్‌షో ముగించుకుని కేసీఆర్ సూర్యాపేటకు బయల్దేరారు. మార్గమధ్యలో తిప్పర్తి వద్ద మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా జనం ఎదురుచూడడం కనిపించింది. దాంతో కేసీఆర్ అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత నకిరేకల్ పట్టణం చీమలగడ్డ వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు.

### రోడ్‌షోలు సూపర్ సక్సెస్...

మిర్యాలగూడ, సూర్యాపేటల్లో జరిగిన కేసీఆర్ రోడ్‌షోలు సూపర్ సక్సెస్ అయ్యాయి. అంచనాకు మించి జనం తరలిరావడంతో రెండు చోట్ల జన ప్రభంజనంలా మారింది. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మార్గదర్శనంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జనం భారీగా తరలివచ్చారు. ఎటుచూసినా కిక్కిరిసిన జనంతో పట్టణాలు గులాబీమయంగా మారాయి. మిర్యాలగూడలో 2 కిలోమీటర్ల మేర జనం కేసీఆర్ బస్సు వెంట పరుగులు తీస్తూ ప్రసంగం విన్నారు. ముఖ్యంగా యువత, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో తమ అభిమాన నేత కోసం తరలిరావడం విశేషం. కేసీఆర్ బస్సుపై పూలవర్షం కురిపిస్తూ చేతులు ఊపుతూ.... ఈలలు వేస్తూ... కేరింతలు, చప్పట్లతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇక కేసీఆర్ పదునైన ప్రసంగానికి ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా తమ ప్రాంతానికి కేసీఆర్ వస్తుండడంతో మధ్యాహ్నం నుంచి మిర్యాలగూడకు జనం తండోపతండాలుగా తరలిరావడం కనిపించింది. దారిపొడవునా ఎడతెగని జనప్రవాహం కొనసాగడంతో 2 కిలోమీటర్ల రోడ్‌షోకు 40నిమిషాల సమయం తీసుకుకోవడం విశేషం. బస్సుయాత్రలో దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, రాష్ట్ర నేతలు ఇస్లావత్ రాంచందర్‌నాయక్, నల్లమోతు సిద్దార్థ, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.



సూర్యాపేటలో రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం, అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



మిర్యాలగూడ రోడ్‌షోలో నినాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పక్కన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

నాటి నుంచీ కాంగ్రెస్సే మనకు శత్రువు

# ప్రభుత్వంపై పోరాటానికి బీఆర్ఎస్‌ను గెలిపించాలి

## సాగర్ నీళ్లకు కాంగ్రెస్‌తోనే కరువు

- చేతగాని దద్దమ్మల్లా జిల్లా మంత్రులు
- బస్సుయాత్రలో జన ప్రభంజనం
- అడుగడుగునా కేసీఆర్‌కు ఘనస్వాగతం
- పలుచోట్ల గోడు వెల్లిబుచ్చుకున్న రైతులు
- తొలిరోజు రోడ్‌షోలు గ్రాండ్ సక్సెస్



మిర్యాలగూడలో కేసీఆర్ రోడ్ షోలో జన సందోహం

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్24(నమస్తే తెలంగాణ) : 'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించండి. 10-12 ఎంపీ సీట్లు గెలిస్తే భూమి.. ఆకాశం ఒక్కటి చేసి పోరాటం చేద్దాం. నేను హామీ ఇస్తున్నా. మీరిచ్చే బలమే కేసీఆర్ బలం. ప్రభుత్వం మెడలు వంచాలంటే బీఆర్ఎస్ గెలవాలి. బీఆర్ఎస్ పోరాటంతోనే రాష్ట్రానికి మంచి జరుగతది' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నాటి నుంచి నేటి వరకు మనకు కాంగ్రెస్ పార్టీనే శత్రువు... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది... సాగర్‌కు నీళ్ల కరువు వచ్చింది అని తెలిపారు. నల్లగొండకు చెందిన చేతగాని దద్దమ్మలు మంత్రులుగా ఉన్నారని జిల్లా నుంచి నీళ్ల మంత్రి ఉండగా సాగర్ కట్టను కేఆర్ఎంబీకి అప్పజెప్పారని తీవ్రంగా మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేసీఆర్ తలపెట్టిన బస్సుయాత్రకు తొలిరోజు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జనం నీరాజనం పట్టారు. అడుగడుగునా స్వాగతం పలుకుతూ తమ సమస్యలను ఏకరువు పెడుతూ కేసీఆర్ చెప్పే మాటలు వినేందుకు ఆసక్తిని ప్రదర్శించారు. మిర్యాలగూడ పట్టణంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన భారీ రోడ్‌షోలో పాల్గొని కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సరిగ్గా 21 సంవత్సరాల క్రితం తాను పాదయాత్రలో భాగంగా కోదాడ నుంచి మిర్యాలగూడకు వచ్చానని గుర్తు చేశారు. ఆనాడు కూడా సాగర్ కాల్వకు నీళ్లు ఇవ్వకుంటే పోరుబాట చేస్తే అక్కున చేర్చుకున్నారని చెప్పారు. తెలంగాణకు బతుకే నీరంటూ తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాగర్ జలాశయంలో నీరు లేకున్నా రైతులు ఇబ్బంది పడకుండా రైతులను కాపాడినట్లు వివరించారు. కానీ నేడు పొలాలను ఎండబెట్టి రైతులను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ సర్కార్ ఆనాడు ఎడమ కాల్వకు 18 పంటలకు నీరిస్తే రైతులు బంగారు పంటలు పండించారన్నారు. నీళ్లు, కరెంటు, రైతుబంధు ఇవ్వలేక జిల్లా మంత్రులు తనను తిట్టుడే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. తాను వస్తుంటే ఆర్జాలబావి వద్ద రైతులు ఎదురేగి ధాన్యం కొంటలేరని చెప్పారన్నారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువైతే... కాళేశ్వరం నుంచి మూసీ నదిలో వదిలి అక్కడి నుంచి ఉదయసముద్రం నుంచి పెద్దదేవులపల్లికి వదిలి శాశ్వతంగా నీటిని అందించాలని కూడా తాము ఆలోచించామని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌కు కీలకం అంటూ బంగారు తెలంగాణ అయ్యేదాకా కొట్లాడాలంటే ఇప్పుడు బీఆర్ఎస్ గెలువాలన్నారు. నల్లగొండలో కారు గుర్తుపై ఓటు వేసి కంచర్ల కృష్ణారెడ్డి బ్రహాండమైన మెజార్టీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత గెలుపుతోనే రానున్న కాలంలో ప్రభుత్వం మెడలు వచ్చేందుకు సిద్ధం కావాలని ప్రజలను కోరారు.

### నేడు భువనగిరిలో కేసీఆర్ రోడ్ షో

- సూర్యాపేట నుంచి బస్సు యాత్ర
- సాయంత్రం 4.30 గంటలకు సాయిబాబా గుడి నుంచి ర్యాలీ
- అన్ని ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ పార్టీ

> iii

## సూర్యాపేట మెజారిటీతోనే కృష్ణారెడ్డి విజయం

- మీ ఉత్సాహం చూస్తుంటే ఇక్కడే 50వేల మెజారిటీ ఖాయం
- సాగు, తాగు నీటి విషయంలో మంత్రి ఉత్తమ్ ఎందుకు మౌనంగా ఉంటున్నాడు?
- పదేండ్లు పచ్చగా ఉన్న జిల్లాలో పంటలు ఎండుతున్నయ్.. గొంతులు ఆరుతున్నయ్
- సూర్యాపేట రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సూర్యాపేట, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : 'మిర్యాలగూడ నుంచి సూర్యాపేటకు వస్తుంటే మధ్యన రైతులు వచ్చి బస్సు ఆపి తమ అరిగోస వినిపిస్తుంటే ఆలస్యమైంది.. రాత్రి తొమ్మిది దాటినా తండోపతండాలుగా, వేలాదిగా జనం గంటల తరబడి నిరీక్షించారంటే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సూర్యాపేట మెజారిటీతోనే నల్లగొండ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి విజయం సాధిస్తారనే నమ్మకం వచ్చింది. ఇక్కడ 50వేలకు పైనే మెజారిటీ వస్తుందనే ధీమా కనిపిస్తున్నది' అని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. సూర్యాపేట రోడ్‌షోలో కేసీఆర్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో జగదీశ్‌రెడ్డి రెండు పర్యాయాలు మంత్రిగా పని చేస్తే సూర్యాపేట నియోజకవర్గంతో పాటు జిల్లా ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి మంత్రిగా ఉంటే నయాపైసా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. ప్రధానంగా నాలుగైదు దశాబ్దాల పాటు ఎడారిగా ఉన్న తుంగతుర్తి, సూర్యాపేటతో పాటు కోదాడ నియోజకవర్గ పరిధిలోని కొన్ని ప్రాంతాలకు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను తెచ్చి 2.50 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేశామని తెలిపారు. పదేండ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో పచ్చగా ఉన్న జిల్లా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నిండా నాలుగు నెలలు కాకముందే ఎడారిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది పిల్లర్లు ఉన్న మేడిగడ్డ బ్యారేజీకి మూడు పిల్లర్లు కుంగాయని కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టారని, మరో పక్క నీళ్లున్నా సాగర్ నుంచి ఒక్క తడికి నీటిని వదలలేని దౌర్భాగ్య స్థితిలో జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉన్నారని దుయ్యబట్టారు.

### కాంగ్రెస్ నీళ్లిస్తుందన్న నమ్మకం పోయింది

నీటి నిర్వహణ లోపం, రాజకీయ దురుద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టును పండబెట్టిన కాంగ్రెస్ సాగునీటిని ఇస్తుందనే నమ్మకం తనకు, రైతులకు కూడా పోయిందని కేసీఆర్ అన్నారు. మూసీ మురికి నీటి నుంచి సూర్యాపేటను విముక్తి చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని తెలిపారు. ఇవాళ రాష్ట్రంలో కాంంగ్రెస్, ప్రజలకు మధ్య పంచాయితీ పడ్డదని, మాట్లాడే పెద్ద కేసీఆర్ బీఆర్ఎస్‌కు బలమొస్తే అది తెలంగాణ ప్రజల శక్తి అవుతదని కేసీఆర్ అన్నారు. దయచేసి ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కృష్ణారెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్. రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్ పాల్గొన్నారు.



### కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష

పదమూడేండ్ల ఉద్యమ పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష. పదేండ్ల పాటు అహర్నిశలు జనం కోసం తపన పడి వారి బాగోగులను చూసుకుంటే చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కండ్లముందే నిర్వీర్యం అవుతుంటే జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. పదేండ్ల తరువాత ఈ జిల్లాలో 120 రోజుల్లో ఏం జరిగిందో తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ చేతుల్లో ఉన్న నాడు ఎంత అద్భుతంగా ఉండేనే ప్రజలు నెమరువేసుకుంటున్నారు. పదేండ్లు రైతులు కడుపులో చల్ల కదలకుండా రాత్రి పూట బయటకు వెళ్లకుండా లక్షల ఎకరాలు ఎలా పండించుకున్నారు, ఒక్క బోరు మోటారు కాలకుండా పంట ఎలా పండించుకున్నారో ప్రజలందరికీ తెలుసు. ఆరోగ్యం బాగా లేకున్నా కేసీఆర్ నా ప్రజలు, రైతులే ముఖ్యమని నాడు తెలంగాణ రాష్ట్రం తెచ్చిన సాహసంతో మరో పోరాటానికి సిద్ధమై వచ్చారు. సూర్యాపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్‌కు అండగా ఉండి ఎంపీ ఎన్నికల్లో కారుకు గుర్తుకు ఓటేసి గెలిపిద్దాం.

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



నకిరేకల్‌లో కేసీఆర్‌కు జేజేలు పలుకుతున్న జనం